పెన్నాలో పెరిగిన నీటి ఉధృతి

ప్రజాశక్తి-చెన్నూరు : పెన్నా నది ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్ కుందునది ద్వారా పెన్నా నదికి చేరుతోంది. మైలవరం జలాశయం వరద నీటితోపాటు భారీ వర్షాలు కారణంగా వంకలు, వాగులు ద్వారా వస్తున్న వర్షం నీరు పెన్నా నదికి చేరడంతో వద్ద పెన్నా పరవళ్లు తొక్కుతోంది. సోమవారం సాయంత్రానికి 28 వేల క్యూసెక్కులపైగా వరద నీరు దిగువనున్న సోమశిల జలాశయంలోకి పరుగులు పెట్టింది. పెన్నా నదిపై నిర్మించిన ఆది నిమ్మాయపల్లి ఆనకట్ట వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. కెసి కెనాల్ అధికారులు నీటి ఉధృతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. చెన్నూరు వద్ద ఉన్న సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారులు సిబ్బంది చెన్నూరు కొండపేట పెన్నా నది వంతెన వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్నారు. చెన్నూరు మండల వ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం, ఆదివారం రెండు రోజులు భారీ వర్షాలు కురువగా 51.8. మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

జడ్‌పిటిసి ఉప ఎన్నిక పోరుకు
సర్వ సన్నద్ధం



నేడే పోలింగ్

25 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలు గుర్తింపు

1,350 మందితో పోలీసు బందోబస్తు

పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సుల తరలింపు

పులివెందులలో పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో జడ్‌పిటిసి ఉప ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ నిబంధనల మేరకు జిల్లా అధికార యంత్రాంగం కడప జిల్లాలోని పులివెందుల, అన్నమయ్య జిల్లాలోని ఒంటిమిట్ట జడ్‌పిటిసి స్థానాలకు మంగళవారం ఉప ఎన్నికలను నిర్వహించనుంది. ఒంటిమిట్ట, పులివెందుల స్థానాల పరిధిలోని 45 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులను నియమించింది. జిల్లా ఎన్నికల అధికారులు రూట్ ఆఫీసర్లు, పిఒలు, ఎపిఒలు, మైక్రోఅబ్జర్వర్లు, పోలీస్ అధికారులతో కలిసి పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులను మూడు జీపీఎస్ సదుపాయాలతో కూడిన బస్సుల్లో తీసుకుని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. వెబ్‌కాస్టింగ్, సిసి కెమెరాల నిఘా పర్యవేక్షణలో ఉపఎన్నికలను నిర్వహించడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకుంది. జడ్‌పిటిసి ఉప ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. 1,350 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహిస్తోంది. ఒంటిమిట్టలో 15, పులివెందులలో 10 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. ప్రతి పోలింగ్ కేంద్రానికి సిఐ స్థాయి పోలీస్ అధికారితో కూడిన సుమారు 30 నుంచి 40 మంది పోలీసులను మోహరించింది. ఒంటిమిట్ట పరిధిలోని సోమశిల వెనుకజలాల పరిధిలోని గ్రామాల్లో స్మగ్లర్ల ఆగడాలు నెలకొన్న నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒంటిమిట్టలో బ్యాలెట్ బాక్సులను తీసుకెళ్తున్న సిబ్బంది

వేతనం పెంచాలని అడిషనల్ కార్మికుల
రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఏడేళ్లుగా అడిషనల్ కార్మికులకు కనీస వేతనం రూ.12వేలు ఇస్తున్నారని, కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రూప్ 18,600 ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) కడప నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, నగర అధ్యక్షులు సుంకర రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం బాధాకరమని చెప్పారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో దీక్షలతో ఆగకుండా దశలవారీగా కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అప్పటికి సమస్యలు పరిష్కారం కాకపోతే అవసరమైతే కడప నగర కార్మికులంతా సమ్మెకు వెళ్తామని పేర్కొన్నారు. దీక్షలకు జిల్లా ఉపాధ్యక్షులు కంచు పాటి తిరుపాల్, డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్, పర్మినెంట్ కార్మికుల కార్యదర్శి తొండ మస్తాన్, ఆశి బాబు, మహిళా కార్మికులు మద్దతు తెలిపారు. దీక్షలో మణికంఠ, శంకర్ నాయక్, మహేశ్వర్ నాయక్, మహేష్, శివ నాయక్, లక్ష్మి నరసయ్య, వెంకట్ రాముడు, నాగేష్, ఇషక్, నరసింహ, పెంచలయ్య, నాగేంద్ర, ఏసన్న, రాజు, కుమార్, పెద్ద సంఖ్యలో అడిషనల్ కార్మికులు పాల్గొన్నారు.

దీక్షలు చేస్తున్న కార్మికులు

అక్రమ వసూళ్లకు పాల్పడిన 18 మందిపై చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

చెత్త పన్ను అక్రమ వసూళ్ల విషయంలో ఇప్పటివరకూ 18 మందిపై చర్యలు తీసుకున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కమిషనర్ ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 8 మందితో పాటు, ఎంహెచ్ఒను సరెండర్ చేశామని పేర్కొన్నారు. ఎక్కడెక్కడ అక్రమ వసూలు చేశారనే విషయాన్ని తెలుసుకునేందుకు ఏడుగురుతో కూడిన ఆరు టీములను వేశామని తెలిపారు. 2,414 మందిని విచారించామని చెప్పారు. ఆగస్టు 2024 నుంచి జూలై 2025 వరకు ఎక్కడెక్కడ చెత్త పన్ను వసూలు చేశారో విచారణ చేపట్టామని పేర్కొన్నారు. గతంలో 8 మందితో పాటు, ప్రస్తుతం ఏడుగురు శానిటరీ సెక్రటరీలు, ముగ్గురు ఆప్కాస్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి రికవరీ కోసం పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టామని చెప్పారు. ఇంకా ఎవరైనా ఉన్నారా అనే విషయాన్ని ఆరా తీస్తున్నామని పేర్కొన్నారు. విచారణలో రూ.16.40 వేలు వసూలు చేసినట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. స్లిప్పులు మాత్రం రూ.4లక్షలకు ఉన్నాయని, ఇవి కూడా కట్టలేదని చెప్పారు. ఆధారాలు ఉంటే ప్రజలు కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అనుమతి లేని లేఅవుట్లను రెగ్యులర్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2025, జూన్ 30 లోపు రిజిస్టర్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. రెగ్యులర్ చేసుకునే ముందు రూ.10 వేలు కట్టాలని చెప్పారు. 30 అడుగుల రోడ్డు ఉన్నా రెగ్యులరైజ్ చేస్తున్నామని చెప్పారు. ఖాళీ స్థలాలపై 14 శాతం ఉన్న డబ్బు వసూలును 7 శాతానికి తగ్గించాలని పేర్కొన్నారు. ఐపిఎల్‌పి ప్రణాళిక తయారు చేస్తున్నామని తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న కమిషనర్

కమిషనర్ చర్యల పట్ల సిపిఎం హర్షం

నగరపాలక సంస్థలో చెత్త పన్ను వసూళ్లలో అవినీతి మీద విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చర్యలు చేపట్టడం హర్షణీయమని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్, మలేరియా, శానిటేషన్ తదితర విభాగాల్లో అవినీతి కొనసాగుతుందని, దీని మీద కూడా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

ఐడిబిఐని బలహీనపరచవద్దు

- ఆర్థిక రంగ యూనియన్ల జాయింట్ ఫ్రంట్ నాయకులు

ఆందోళన చేస్తున్న యూనియన్ల నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

లాభాల బాటలో నడుస్తున్న, లక్షల కోట్ల రిజర్వులున్న ఐడిబిఐ బ్యాంకును డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని ఎల్ఐసి, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బి, ఐడిబిఐ యూనియన్ల నాయకులు రఘునాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అజీజ్, రాహుల్ తేజ్, దుర్గేష్ అన్నారు. సోమవారం స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం ఎదుట ఎల్ఐసి యూనియన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐడిబిఐ బ్యాంక్ ఉద్యోగుల, అధికారుల దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 2,100 బ్యాంకు శాఖలతో, రూ.4 లక్షల కోట్ల రిజర్వు నిధులతో ఐడిబిఐ పనిచేస్తుందని అన్నారు. 10 ఏళ్ల కిందట నష్టాల్లో ఉన్న ఐడిబిఐని ఎల్ఐసి కొని లాభాల బాటలోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల్లో రూ.10వేల కోట్ల లాభాలు సాధించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.7026 కోట్ల నిర్వహణ లాభాల్ని, రూ.209 కోట్ల నికర లాభాన్ని ఐడిబిఐ సాధించిందన్నారు. ఇంత గొప్పగా పని చేస్తున్న ఐడిబిఐని డిసిన్వెస్ట్ చేయాలనుకోవటం ప్రయివేట్, విదేశీ కంపెనీలకు ఊడిగం చేయడమేనని అన్నారు. రీజనల్ రూరల్ బ్యాంక్‌ల షేర్లు అమ్మడానికి ఐపిఒ విడుదల చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందని అన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో 100శాతం ఎఫ్‌డిఐ అనుమతించి విదేశీ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం ఎర్ర తివాచీ పరుస్తోందని చెప్పారు. దేశ ఆత్మ నిర్భర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటి చర్యలను 'జాయింట్ ఫ్రంట్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఇన్ ఫైనాన్షియల్ సెక్టార్' ఆధ్వర్యంలో తాము ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. నిరసన ప్రదర్శనలో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, రాజు, అయ్యవారు రెడ్డి, అమీనా పర్వీన్, రత్న కిషోర్, కుమార్, గౌస్, చిన్నయ్య, సాదక్ వలి పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

కారును ఢీకొన్న భారీ వాహనం
ఇద్దరు మృతి, మరో నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర శివారులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆళ్లగడ్డలోని బాలాజీ నగర్‌కు చెందిన దూదేకుల హుస్సేనమ్మ, లింగం దిన్నెకు చెందిన ఉదయ్ కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కారులో అరుణాచలానికి వెళ్లి అక్కడ గిరి ప్రదక్షణ ముగించుకుని తిరిగి సొంతూరికి బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు సోమవారం తెల్లవారుజామున కడప నగర శివారులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల వద్ద రాగానే ఫ్లైయాష్ తీసుకువెళుతున్న భారీ ట్యాంకర్ లారీ ఢీకొంది. ప్రమాదంలో ఆళ్లగడ్డ బాలాజీ నగర్ కు చెందిన దూదేకుల హుస్సేనమ్మ(53) ఇదే ప్రాంతంలోని లింగం దిన్నెకు చెందిన ఉదయ్ కుమార్ రెడ్డి (32) అక్కడికక్కడే మృతి చెందారు. లాలు, షర్మిల, రాజా దస్తగిరి, క్రియాన్స్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు జనరల్ ఆసుపత్రికి తరలించారు. హుస్సేనమ్మ, ఉదయ్ కుమార్‌రెడ్డి మృతదేహాలను కడప రిమ్స్‌లోని మార్చురీకి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పమాదంలో మృతిచెందిన హుసేనమ్మ, ఉదయ్‌కుమార్‌రెడ్డి

పోలింగ్ కేంద్రాల మార్పు సరికాదు

- ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జడ్‌పిటిసి ఉప ఎన్నికలలో పోలింగ్ కేంద్రాలను మార్చడం సరికాదని, టిడిపి కుట్రలను ఎన్నికల కమిషన్ గమనించాలని, టిడిపి నాయకులు తీసుకున్న ఓటర్ స్లిప్పులను తిరిగి ఓటర్లకు ఇవ్వాలని కడప పార్లమెంట్ సభ్యుడు వై.ఎస్. అవినాష్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లు వేయడానికి బయట జనాన్ని ఉంచారని, ఓటరు స్లిప్పులను టిడిపి నాయకులు కొత్తపల్లి, నల్లపరెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లిలో ఇంటింటికీ వెళ్లి డబ్బులిచ్చి ఓటర్ల స్లిప్పులను వెనక్కు ఇవ్వకపోతే బెదిరిస్తున్నారన్నారు. మూడురోజులుగా ఎన్నికల కమిషన్ దృష్టికి పదేపదే తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మొద్దు నిద్ర వీడటం లేదన్నారు. ఓటరు స్లిప్పు లేకపోతే ఓటు ఎక్కడ ఉందో ఓటరుకు అర్థం కాని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఓటరుకు తమ ఓటు హక్కుని వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికి ఓటరు స్లిప్పులు మళ్లీ అందించాలని కోరారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించండి.. ప్రశాంతంగా జడ్‌పిటిసి ఉప ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కర్నూల్ డిఐజి కోయా ప్రవీణ్‌ను కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో డిఐజిని కలిసి 10 నిమిషాల పాటు చర్చించారు. వైసిపి నాయకులను వందల మందిని బైండోవర్ చేశారని, వారందరిని వదిలిపెట్టి వారి ఓటు చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. కూటమికి చెందిన బయటి వ్యక్తులు ఎన్నికలు జరిగే ప్రాంతాలలో ఉన్నారని వారిని వెంటనే పంపించాలన్నారు. అలాగే ఓటర్ సిప్పులను టిడిపి నాయకులు తీసుకున్నారని వారికి తిరిగి ఇప్పించాలని కోరారు.

వైసిపికి ఓటమి భయం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

వైసిపి నాయకుల్లో ఓటమి భయం పట్టుకుందని, పులివెందులలో కొన్ని దశాబ్దాల తర్వాత మొదట సారీ శాంతియుతంగా, ప్రశాంతంగా ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారని అరాచకాలు దౌర్జన్యాలు కుట్రలు లేకుండా పోలింగ్ ఉంటుందని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు శాసన సభ్యులు ఆదినారాయణ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ పులివెందుల మొదటిసారి ఉప ఎన్నికలు శాంతియుతంగా నిర్వహిస్తున్నామని కానీ వైసిపి నేతలు రివర్స్ స్టేట్మెంట్స్ ఇస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో వైసిపికి వ్యతిరేకత టడిపికి అనుకూలత పెరిగింది అన్నారు. సమస్య చెప్పిన వెంటనే 48 గంటల్లో ఎర్రబెల్లి చెరువుకి నీళ్ల సమస్య తీర్చడం, గతం కంటే అన్నదాత సుఖీభవ ఎక్కువ ఇవ్వడం, అరటి రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఇన్‌పుట్ సబ్సిడీ , జాతీయ రహదార్లు ,ఇక్కడికి వచ్చిన గృహ శాఖా మంత్రి 500 ఇళ్ళు మంజూరు చేస్తామని చెప్పడం, పింఛన్లు నాలుగు వేలకు పెంపు , కొత్తగా అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయడం వల్ల పార్టీకి అనుకూలత పెరిగిందన్నారు. వివేక హత్య కేసులో న్యాయం కోసం కుమార్తె సునీత పోరాడుతుందని, ఆమె బాధ తీరాలని తాము కూడా కోరుకుంటున్నామని చెప్పారు.

సింగిల్ విండో అధ్యక్షుడిగా ముండ్ల శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - చెన్నూరు : చెన్నూరు సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా చెన్నూరు మండలం ఓబులపల్లి గ్రామానికి చెందిన ముండ్ల శ్రీనివాస్ రెడ్డి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ముండ్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తన పదవికి సహకరించిన తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, కమలాపురం శాసనసభ్యులు కృష్ణ చైతన్య రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు మరి నమ్మకాన్ని నిలబెడతానని సందర్భంగా తెలిపారు. పదవి వచ్చేందుకు కృషిచేసిన మండల కన్వీనర్ కల్లూరు విజయ భాస్కర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

పులివెందులలో జడ్‌పిటిసి ఉప ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిసవిత అన్నారు. సోమవారం మండలంలోని జువారి గెస్ట్ హౌస్‌లో ఆమె మాట్లాడుతూ గతంలో బాబాయిని గొడ్డలిపోటు పొడిచి నారావారి చరిత్ర అని పేపర్లో రాశారని అన్నారు. గతంలో ఎన్నడూ ఇక్కడ ఎన్నికలు జరగనివ్వలేదని అన్నారు. ఇప్పుడు ఎన్నికలు జరుగుతుండడంతో మాజీ ముఖ్యమంత్రి జగన్ ఉలిక్కిపడుతున్నారని తెలిపారు. వైసిపికి కచ్చితంగా ఓట్లు వేయాలని జగన్ ఫోన్ చేసి గ్రామస్తులను బెదిరిస్తున్నారని అన్నారు. ఇప్పుడు వైసిపి, టిడిపితో పాటు మిగతా పార్టీలవారు కూడా ఓటర్ల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతున్నారని తెలిపారు. గతంలో ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. అందుకే వైసిపికి11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారన్నారు. పులివెందుల డిఎస్‌పిని, ఉన్నతాధికారులను బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికలు సజావుగా సాగుతున్నాయని కచ్చితంగా తామే గెలవబోతున్నామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర్‌రెడ్డి, నెల్లూరు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, టిడిపి జాతీయ జనరల్ సెక్రెటరీ ప్రభాకర్ చౌదరి, కూటమి మండల ఇన్‌ఛార్జి తప్పెట్ల మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప

పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉప ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా నిర్వహించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. జడ్‌పిటిఇస లాంటి చిన్న ఎన్నికలను సిఎం కార్యాలయం నుండి నడిపిస్తున్నారని విమర్శించారు. సోమవారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులు, సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. ఒకగ్రామంలో ఓటు ఉంటే మరో గ్రామంలో ఓటు వేసేలా కుట్రలు చేశారు అన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నికలో రిగ్గింగ్ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గం నుంచి ప్రజలను రప్పించి రిగ్గింగ్‌కు టిడిపి నాయకులు ప్లాన్ వేశారన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య కోర్టులో శిక్ష తప్పదు

ప్రజాశక్తి - కడప : దొంగ ఓట్ల కుంభకోణం వెలుగులోకి రావడంతో బిజెపి, ప్రధాని మోడీకి రాజకీయంగా మూడినట్లు స్పష్టమవుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. కడపలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయచోటిలో బిజెపి నాయకులు, మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి రాహుల్ గాంధీపై ఆరోపణలు చేయడం తగదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, బిజెపి కుమ్మక్కై ప్రధాని నరేంద్ర మోడీ ద్వారా దొంగ ఓట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రిని చేసిన కాంగ్రెస్ పార్టీ నుంచి బిజెపిలో చేరిన కిరణ్ కుమార్‌రెడ్డికి తెలివి పూర్తిగా లేకుండా పోయిందని విమర్శించారు. దొంగ ఓట్ల కుంభకోణం చేసిన నరేంద్ర మోడీకి, ఆ పార్టీకి బిజెపికి ప్రజాస్వామ్య కోర్టులో ప్రజలు తప్పక శిక్షిస్తారని హెచ్చరించారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కడప : చేనేత కార్మికులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు టిడిపి తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మడక చక్రధర్ అన్నారు. సోమవారం కృష్ణాపురంలోని చేనేత కార్మికులను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నారా చంద్రబాబు నాయకత్వంలో చేనేత రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. చేనేతలందరూ చంద్రబాబుకు రుణపడి ఉన్నామని తెలియజేశారు. గ్రామంలోని చేనేతలకు సన్మానం నిర్వహించి వారిని ప్రోత్సహించారు. చేనేత మగ్గానికి 200 యూనిట్లు, మర మగ్గానికి 500 యూనిట్లు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పట్టు నూలుపై ఉన్నటువంటి జిఎస్‌టిని ప్రభుత్వమే చెల్లించేందుకు సిద్ధమవడం శుభసూచకమని అన్నారు. త్వరలో ప్రతి చేనేత కార్మికుడికి 25000 నేతన్న భరోసా పథకం కింద ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిసి సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం, పట్టుపోగుల సుబ్బారావు, గాలి రవి, బడిగింజల మురళి, స్థానిక నేతన్నలు పాల్గొన్నారు.

జర్నలిస్టును బెదిరించేవారిపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-కాశినాయన : పేద బడుగు బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్నటువంటి జర్నలిస్టు పుల్లూరు మహబూబ్‌బాషాను చంపుతామని బెదిరిస్తున్న కత్తెరగండ్ల పంచాయతీ సర్పంచ్ భర్త చెన్ను పల్లె వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని పాత్రికేయులు సోమవారం నరసాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కత్తెరగండ్ల పంచాయతీలోని చెన్నవరం గ్రామంలో దూదేకులకు 1993లో శ్మశాన వాటికను కేటాయించారని, దాన్ని ప్రస్తుత సర్పంచ్, వారి బంధువులు కలిసి ఆక్రమించారని పేర్కొన్నారు. దీనిపై కథనం రాసిన జర్నలిస్టును బెదిరిస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జడ్‌పిటిసి ఉప ఎన్నికల సందర్భంగా పట్టణ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు డిఎస్‌పి మురళి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా పట్టణంలో ఎవరు గుంపులు గుంపులుగా ఉండకూడదని, అన్ని వ్యాపార సముదాయాలు మూసివేయాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కూడా సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఊరేగింపులు, ర్యాలీలు చేయరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బాగా శ్రమించి ఉన్నత స్థితికి చేరుకోవాలి

ఓరియంటేషన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథి, కళాశాల యాజమాన్యం, మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థినులు తాము ఇచ్చే సదుపాయాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కందుల విద్య సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు 'ఓరియంటేషన్ కార్యక్రమం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ మాట్లాడుతూ క్రమశిక్షణకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని కోరారు. ముఖ్య అతిథి సయ్యద్ సానియా మాట్లాడుతూ కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఇంజినీర్లుగా తీర్చి దిద్దుకోవాలి అని కోరారు. తాను పార్లమెంట్ సెంట్రల్ హాల్లో ఇచ్చిన ప్రసంగం ఎంతో మందికి స్ఫూర్తి రగిలించిందని తెలిపారు. మొదట విద్యార్థినులు సేఫ్టీకి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. సమాజంలో జాగ్రత్తగా మసలుకోవాలి తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతి ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

పిల్లలను చదువులో ప్రోత్సహించాలి

పిల్లలను చదువులో తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల పూర్వపు విద్యార్థి, ఐఐఎం లక్నో ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణయ్య పిలుపునిచ్చారు. సోమవారం కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఓరియంటేషన్ 2025 కార్యక్రమంలో భాగంగా కడప కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజ్ 2025–26 విద్యా సంవత్సరానికి అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థిని విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంప్రదాయ బద్ధమైన రంగంలో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో చేరిన విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన ఉన్నత స్థానాలను చేరాలని పేర్కొన్నారు. ఆక్టివ్ లిజనింగ్ స్కిల్ చేసుకోవాలని కోరారు. ఆకర్షణీయమైన, ప్రభావవంతమైన కమ్యూనికేషన్ స్కిల్, ప్రభావవంతమైన వ్యక్తుల మధ్య సంబంధాలను నిర్మించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ స్వీయ–స్థాన నిర్దేశం, విశ్వసనీయత నిర్మాణం, ప్రభావవంతమైన కమ్యూనికేషన్, సమాజ పరివర్తనను నడిపించడంలో నాయకత్వం పాత్రను, విద్య ప్రాముఖ్యతను వివరించారు. మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి, వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు, డీన్‌లు పాల్గొన్నారు.

ఆర్‌టిసి మేనేజర్‌కు వినతిపత్రమిస్తున్న షాకీర్ హుస్సేన్

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పించిన నేపథ్యంలో విభిన్నప్రతిభావంతులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షాకీర్ హుస్సేన్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో ఆర్‌టిసి మేనేజర్ మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షాకీర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు కడప జిల్లా పరిసర ప్రాంత నియోజకవర్గంలో ఉన్న విభిన్న ప్రతిభావంతులం సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తున్నందుకు సంతోషిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం పంపిణీ చేస్తున్న పెన్షన్‌ను రు.6000కు పెంచడం వల్ల తమ జీవన ప్రమాణం మెరుగు పడిందన్నారు. పురుష విభిన్నప్రతిభావంతులకు కూడా పూర్తిస్థాయి ఉచిత ప్రయాణ వసతిని కల్పించాల్సిందిగా ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఖాజా, ఆసిఫ్, రహమతుల్లా, విభిన్నప్రతిభావంతులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం అనుమానాలను నివృత్తి చేయాలి

మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చాపాటి రామసుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

భారత ఎన్నికల సంఘం ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చాపాటి రామసుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఈ దేశ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంలో జరిగిన అవకతవకలను గణాంక వివరాలతో కూడిన సమగ్ర సమాచారంతో ఈ దేశ ప్రజల ముందు ఉంచిన విషయం తెలిసిందే అన్నారు. రాజ్యాంగ వ్యవస్థ అయినా ఎన్నికల సంఘం ప్రజలందరికీ జవాబుదారీగా ఉండవలసిన అవసరంలేదు అనే విధంగా ప్రవర్తిస్తోందన్నారు. ఓటర్ల జాబితా సమాచారాన్ని డిజిటల్ రూపంలో సాఫ్ట్ కాపీగా ఇవ్వాలని కోరితే 7 అడుగుల ఎత్తు 400 కిలోల బరువు ఉండే పేపర్లను ఇవ్వడం దారుణమన్నారు. రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటంలో అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు, మేధావులు గొంతు కలిపి రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘం మార్పునకు శ్రీకారం చుట్టాలన్నారు.

అంబేద్కర్ భవనానికి నిధులు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - ఖాజీపేట

తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

స్థానిక సొసైటీ కాలనీలోని అంబేద్కర్ భవన్‌కు నిధులు కేటాయించి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు జయరాం, మరియన్న పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం వారు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రమణమ్మకు వినతి పత్రమిచ్చారు. ప్రజా అవసరాలకు అంబేద్కర్ భవన్ ఎంతగానో ఉపయోగపడుతుండేదన్నారు. ప్రస్తుతం భవనం దెబ్బతిందని, చర్యలు చేపట్టి ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా కృషి చేయాలని కోరారు.

వృద్ధురాలికి రక్తదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నంద్యాల చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామానికి చెందిన వెంకటమ్మ (95)కు కాలు ఆపరేషన్ నిమిత్తం స్థానిక ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఆమెకు బి నెగిటివ్ రక్తం అవసరం కావడంతో సంబంధీకులు ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణను సంప్రదించారు. అందుకు ఆయన స్పందిస్తూ స్వచ్ఛంద సేవా సంస్థలోని సభ్యుడు రాజుపాలెం మండలం అర్కటవేముల బొజ్జవారిపల్లి గ్రామానికి చెందిన క్రిష్టిపాటి నందకిషోర్‌చే రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. సేవా సంస్థ తరపున రక్తదాతకు హృదయయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

రక్తదాత నందకిషోర్

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి

అల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

ప్రజాశక్తి - వేంపల్లె

నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను మింగాలని తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నులి పురుగుల నివారణపై టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఆ మేరకు గోడ పత్రాలను తహశీల్దార్, వైద్యులు నిహారిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుండి జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. పిల్లలకు అల్బెండాజోల్ 400 ఎంజీ మాత్రలను పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా, సిహెఒ వెంకట రత్నం, ఎంపిహెచ్ఇఒ పక్రుద్దీన్, సూపర్‌వైజర్ అరుణ కుమారి, ఐసీడీఎస్ స్వర్ణలత, అంకయ్య, పాల్గొన్నారు.

పేరు మార్పు

తెల్ల వెంకట హార్థిక్, తండ్రి తెల్ల రమేష్ బాబు, డోర్ నెం.93/219, సుబ్బన్నగారి పల్లె గ్రామము, మామిళ్ళపల్లె పంచాయతి, సి.కె.దిన్నె మండలము, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్-516004. నా పేరును ఈ దినము నుండి తెల్ల వెంకట హార్దిక్, తండ్రి తెల్ల రమేష్‌బాబుగా మార్పు చేసుకోవడం జరిగింది. ఇక నుంచి తెల్ల వెంకట హార్దిక్‌గా పిలవడం జరుగుతుంది.

ఉప్పొంగిన వాగులు, వంకలు

అన్నవరం బ్రిడ్జి వద్ద పర్యవేక్షిస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - చాపాడు

రెండు రోజులుగా పడుతున్న వర్షాలకు మండల పరిధిలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. సోమవారం మండల పరిధిలో 44.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లో ఎక్కడ చూసినా వర్షపు నీరు నిండుగా దర్శనమిస్తోంది. గత వారంలో ఎండ తీవ్రత అధికంగా ఉండి ఉక్కపోత ప్రారంభమైంది. గురువారం నుంచి పడుతున్న వర్షానికి వాతావరణం పూర్తిగా చల్లబడింది. సోమాపురం, బద్రిపల్లె, గుంతచియ్యాపాడు, రాజువారిపేట, అనంతపురం గ్రామాల వద్ద ఉన్న వంకలు అధికంగా ప్రవహిస్తున్నాయి. గుంత చియ్యాపాడు వద్ద వంక ఉధృతికి లో లెవెల్ బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తోంది. సోమవారం ఉదయం 10 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. క్రమేపీ తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు కొనసాగాయి. చాపాడు, నక్కలదిన్నె మార్గాన ఉన్న గుండ్ల వంక కూడా ఉధృతంగా పారుతోంది. కుందూ నదిలో నీరు అధికంగా వస్తుండడంతో కుందుతీర గ్రామాల్లో తహశీల్దార్ రమాకుమారి సిబ్బందిని అప్రమత్తం చేశారు. నదిలో 15 వేల క్యూసెక్కుల పైగా నీరు ప్రవహిస్తోంది. అన్నవరం, అల్లాడుపల్లె బ్రిడ్జిల వద్ద సిబ్బందిని పర్యవేక్షణకు ఉంచారు. ప్రజలు ఎవరూ కూడా నదిలో దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె

చియ్యపాడులో కూలిన మట్టి మిద్దె

ఆదివారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షానికి చియ్యపాడు గ్రామంలో మట్టిమిద్దె కుప్ప కూలింది. గ్రామానికి చెందిన సిద్దయ్య ఇల్లు వర్షానికి పడిపోయింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తరఫున నూతన గృహాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని బాధితులు కోరారు. పాడుబడిన గృహాలు అధిక వర్షాలకు కూలే ప్రమాదం ఉందని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

వీధుల్లో వర్షపు నీరు.. అవస్థల్లో కాలనీ వాసులు

వేంపల్లె : స్థానిక ఇమాంనగర్‌లో వర్షపు నీరు చేరడంతో ఆ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల నుండి వేంపల్లెలో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన ఇమాంనగర్‌తోపాటు ఆయా ప్రాంతాల్లో వర్షపు నీరు భారీ ఎత్తున నిలిచింది. ఈ పరిస్థితుల్లో ఇంట్లో ఉన్న వారు బయటికి రాలేక పోతున్నారు. కొన్నేళ్లుగా ఈ సమస్య ఇలాగే ఉందని ప్రజలు వాపోతున్నారు. కొద్ది పాటి వర్షం కురిసినా ఇమాంనగర్ వీధి అంతా వర్షపు నీటితో నిండిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ సౌకర్యం సరిగా లేకపోవడంతో పైతట్టు ప్రాంతాల నుండి వర్షపు నీరు వచ్చి చేరుతోందన్నారు. కూరగాయల తోపుడు బండ్లు ఇమాం నగర్‌లోకి రావడం లేదని పేర్కొంటున్నారు. సమస్యను టిడిపి నేత మహమ్మద్ షబ్బీర్‌కు ప్రజలు ఫిర్యాదు చేయడంతో సోమవారం జెసిబితో ఆ ప్రాంతంలో ప్రధాన రహదారిలో ఉన్న డ్రెయినేజీ కాలువలో చెత్తను తొలగించారు. నీరు మాత్రం అలాగే నిలిచిపోయింది.

గుంతచియ్యపాడు లోలెవెల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వర్షం నీరు

వేంపల్లె : ఇమాంనగర్‌లో నిలిచిన వర్షపునీరు

అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అనడం అవాస్తవం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రధాని మోడీ పాలనలో ప్రపంచంలోనే భారత్ 4వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని బిజెపి నేతలు చెప్పడం అవాస్తవమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలే కరులతో మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థ 3వ స్థానంలోకి చేరుకొంటుందని ప్రధా న మోడీతో పాటు బిజెపి నేతలు పదేపదే చెప్పడం మసి పూసి మారేడు కాయ చేయడమే వీరి పని అన్నారు. ఇది వాపు మాత్రమే కాని బలం కాద న్నారు. అంతర్జాతీయ మానిటరీ ఫండ్ 2025 నివేదిక ప్రకారంగా తలసరి జిడిపిలో ప్రపంచంలోని 191 దేశాలలో భారతదేశం స్థానం 137లో ఉందన్నారు. మన దేశపు తలసరి జిడిపి 2878 డాలర్లు అన్నారు. ఒక్క లక్ష 40 వేల 941 డాలర్లతో నంబర్‌వన్ స్థానం లగ్జంబర్గ్ ఉండగా ఐర్లాండ్ ఒక్క లక్ష 8 వేల 919 డాలర్లతో 2వ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. స్విట్జర్లాండ్ 1 లక్షా నాలుగు వేలు, 896 డాలర్లతో 3వ స్థానంలో, సింగపూర్ 92,932 డాలర్లతో 4వ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. మనదేశం మాత్రం 2,878 డాలర్లతో 137వ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. అమెరికా కూడా తలసరి జిడి పిలో ఏడవ స్థానంలో ఉందన్నారు. కాని టోటల్ జీడీపీలో మొదటి స్థానం అన్నారు. ఎందుకంటే జనాభా ఎక్కువ అన్నారు. చైనా కూడా తలసరి జిడిపిలో 70వ స్థానంలో ఉండగా టోటల్ జీడీపీలో రెండవ స్థానం అన్నారు. కారణం జనాభా 142 కోట్లు అన్నారు. జర్మనీ తలసరిం జిడిపిలో 17వ స్థానంలో ఉండగా టోటల్ జీడీపీలో 3వ స్థానం అన్నారు. భారతదేశం తల సరి జిడిపిలో 137వ స్థానంలో ఉండగా టోటల్ జీడీపీలో 4వ స్థానం అని దీనికి కారణం 144 కోట్ల జనాభా ఉంది అన్నారు. జనాభా ఎక్కువ కాబట్టి టోటల్ జిడిపిలో ఎక్కువ కనిపిస్తుంది కాని తలసరి జిడిపిలో మనం ఎక్కడో కింద ఉన్నట్లు చెప్పారు.

జమ్మలమడుగులో ముమ్మరంగా వరి సాగు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండల పరిధిలోని పెన్నానది తీర ప్రాంతం, ప్రొద్దుటూరు ప్రధాన రహదారి వెంబడి పొలాలు ఉన్న రైతులు వరి సాగు ముమ్మరం చేశారు. నది పరీవాహక గ్రామాల్లో గత రెండు వారాల నుంచి వరి మడులు తయారు చేసుకోవడం, నారు పోయడం, భూములను చదును చేసుకోవడం చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి రాత్రి పూట వర్షాలు కురవడంతో పొన్నతోట, గూడెంచెరువు, అంబవరం, హనుమంత గిరి, సున్నపురాళ్లపల్లె, సిరిగేపల్లె గ్రామాలు పెన్నానదికి కుడి వైపు ఉన్నవి మరో వైపు కన్నెలూరు, గొరిగనూరు, ధర్మాపురం, దానవులపాడు, సుగుమంచిపల్లి, దేవగుడి గ్రామాల్లో పరిధిలో వరి సాగు చేపట్టారు. ఆగస్టు మెదటి వారం నుంచి విస్తారంగా వరినార్లు సాగు చేపట్టారు. ప్రొద్దుటూరు రహదారి వెంబడి పొలాల రైతులు జూలై నుంచే వరి సాగు చేశారు. గూడెంచెరువు, అంబవరం హనుమంతగిరి గ్రామ రైతులు కొంత మంది జీలుగ, పిల్లిపెసర సాగు చేసి వరి మడులను కలియదున్నుతున్నారు. ఇది పచ్చిరొట్టగా పైరుకు ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. మరి కొంతమంది సత్తువ కోసం డిఎపి, యూరియా, 20.20.0.13 వంటి గ్రోమోర్‌ను దుక్కిలో వేసి నాట్లు వేస్తున్నారు. నాలుగు రోజుల నుండి వర్షాలు కురవడం దానికి తోడు మైలవరం జలాశయం నుంచి ఇటు పెన్నా నదికి, అటు ఉత్తర, దక్షిణ కాలువలకు నీరు వదలడంతో రైతులు వరి సాగులో బిజీబిజీగా ఉన్నారు.

జాతీయ రహదారి.. ప్రమాదకరంగా మారి

ప్రజాశక్తి - ఖాజీపేట

రక్షణ గోడకు నోచుకోని ఓ కల్వర్టు

మండల పరిధిలోని కడప-కర్నూలు జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో నిర్మించిన సాగునీటి కల్వర్టులకు సంబంధించి రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. రావుల పల్లె చెరువు సమీప ప్రాంతం వద్ద కల్వర్టుకు రక్షణ గోడ నిర్మించలేదు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా కాలువలో పడే ఆస్కారం లేకపోలేదు. అంతేకాకుండా వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వహణ సంస్థ విభాగ అధికారులు స్పందించి కల్వర్టులకు రక్షణ గోడలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహన దారులు కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

వేంపల్లె : వేంపల్లె ఎపి గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ సుగుణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5,6,7,8వ తరగతుల్లో మిగిలిన సీట్లకుగాను ప్రవేశపరీక్ష నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 14 సాయంత్రం 5గంటల్లోపు విద్యార్థి ఆధార్, స్టడీ సర్టిఫికెట్, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (బాలికలు/బాలురు)లో వారి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న వారు ఈనెల 16న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలన్నారు. ప్రతిభ ఆధారంగా సీటు ఇవ్వనున్నట్లు వివరించారు. వివరాలకు 87126 25061, 83282 65863 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సొసైటీ నూతన కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే 'పుట్టా'ను సన్మానించిన సొసైటీ నూతన కమిటీ

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె రైతు సేవ సహకార సంఘం సొసైటీ చైర్మన్, డైరెక్టర్లుగా ప్రభుత్వ నియమించడంతో వారు సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి సన్మానించారు. చైర్మన్‌గా సీతారామాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఎం.నరసింహారెడ్డి, డైరెక్టర్లుగా నెర్రవాడ గ్రామానికి చెందిన మేకల సుదర్శన్, జి.వీరారెడ్డి నియమితులయ్యారు. తమపై నమ్మకం ఉంచి సొసైటీ కమిటీలో స్థానం కల్పించారన్నారు. రైతుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సొసైటీని అన్ని విధాలా బాగు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ గురివిరెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మని శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సిల భూమి ఆక్రమణ కాకుండా చూడాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండల పరిధిలోని జాండ్లవరం ఎస్‌సి కాలనీకి చెందిన వారి పర్యవేక్షణలో గత 12 ఏళ్లుగా ఉన్న భూమి ఆక్రమణకు గురి కాకుండా చూడాలని అధికారులను కోరారు. కొంతమంది నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఆ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌సిలు మాట్లాడుతూ జాండ్లవరం విఆర్వో కాలనీ సమీపంలో సర్వే నెంబర్ 1102,1105లో తాము సాగు చేసుకుంటున్న భూమిపై అగ్ర వర్ణాల వారి కన్ను పడిందన్నారు. ఈ స్థలంలో ఎస్‌సిలు చందాలు వేసుకొని వేలాంగిని మాత గుడి కూడా నిర్మించారన్నారు. అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఎస్‌సిలు కోరారు.

స్కౌట్ సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఎన్‌సిసి స్కౌట్ విద్యార్థులకు స్కౌట్ సామగ్రిని దాత భూమిరెడ్డి శైలజ కుటుంబ సభ్యులు భూమిరెడ్డి శివ కల్యాణ్, భూమిరెడ్డి కేశవరెడ్డి జ్ఞాపకార్థం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత భూమిరెడ్డి శైలజ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయుడు గురప్ప, వ్యాయామ ఉపాధ్యాయుడు సుధాకర్, దరిశ నాగరాజు తమ ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థని స్కౌట్ విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందజేయని కోరారని తెలి పారు. దాతలు సహకరించి ముందుకు వచ్చారని వారికి తమ సంస్థ తంపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గీత మాట్లాడుతూ దాతలు చేసిన సహాయం మరువలేనిదన్నారు. విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా దాతలను మరువకూడదని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగరాజు, సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్, సంస్థ ప్రధాన కార్యదర్శి కుండా మాధవ పాల్గొన్నారు.

స్కౌట్ సామగ్రి అందిస్తున్న దాతలు, సంస్థ సభ్యులు

క్రైం కార్నర్

రైలు కిందపడి యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

సోమవారం తెల్ల వారుజామున రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తూ దాని కిందనే పడి ఒక యువకుడు మరణించిన సంఘటన చోటు చేసుకుంది. ముంబై ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు ఆ యువకుడు ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. కదులుతున్న రైలును ఎక్కబోయి కాలుజారి ట్రాక్, ప్లాట్‌ఫాంకు మధ్యలో పడిపోయాడు. తీవ్ర గాయాలతో మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాప్‌లో నిద్రిస్తూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని ప్రకాష్‌నగర్ కాలనీ బస్టాప్‌లో నిద్రిస్తూ సోమవారం ఒ వ్యక్తి మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని స్థానికులు పేర్కొంటున్నారు. మృతుడు చాపాడు మండలం నక్కలదిన్నె విఆర్‌ఎ దాసరి సునీల్‌కుమార్(36)గా గుర్తించినట్లు ఎఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నామన్నారు.

మహారాజశ్రీ రెండవ అదనపు సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ డివిజన్) : కడప

I.A.No.525/2024 in O.S.No.559/2021

ఎమ్.మాధురి, D/o. SAH నారాయణ, సూపరింటెండెంట్, సీనియర్ కమర్షియల్ మేనేజర్ ఆఫీసు, విజయవాడ. ...పిటిషనరు/ప్రతివాది

Vs

సి.గంగాధర్, S/o. C.గంగన్న, D.No.8/103-1-4, ప్రకాష్ నగర్, కడప. ...రెస్పాండెంట్/వాది

నోటీసు

పిటిషనరు(రెస్పాండెంట్) మీద 960 రోజుల ఆలస్యాన్ని మన్నించమని U/S 5 of Indian Limitation Act క్రింద పిటిషను దాఖలు చేసియున్నారు. కోర్టు వారు నోటీసు పంపినను తీసుకోలేదు. రెస్పాండెంటు 18.08.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా హాజరై మనవి చేసుకొనంతట పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//
ఎ.వి.సుబ్రమణ్యం, B.Com.,B.L.,
అడ్వకేట్, నందలూరు. సెల్:94401 29650.

రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు ప్రొద్దుటూరు

H.M.O.P.No. 90/2024

కె. సుధాకర్ రెడ్డి, S/o కె.శివనారాయణ రెడ్డి, 17/227-1, నడింపల్లి, ప్రొద్దుటూరు. ...పిటీషనర్

Vs

K.@ V.జ్యోతి, D/o వి.వెంకటసుబ్బారెడ్డి, 24/95-1, దొరసానిపల్లె, ప్రొద్దుటూరు. ...ప్రతివాది

సమన్

పై నెంబరులోని పిటీషనర్, ప్రతివాది అయిన నీ పై డైవర్స్ పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావాలో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో 22.08.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెయును. అట్లు లేనంత పరోక్షంగా తీర్మానము చేయబడును.

వాయిదా : 22.08.2025
//By Court Order//
జి.చంద్రశేఖర్ రెడ్డి, జి.నిర్మలా దేవి
వై.యస్.సోఫియా
యన్. శివప్రసాద్
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: JAMMALAMADUGU

E.P.NO.34/2025
O.S.NO.73/2020

Yerramreddy Subbalakshumma, W/o Lakshmi Narayana Reddy, Hindu, aged about 72 years, house wife,residing at D.No.1/96A, Karamalavari palli village, Mylavaram mandal, Kadapa dist. ...Petitioner/D.Hr.

Vs

Palla Bala Kondappa, S/O Narasimhulu, aged 60 years, Hindu, Chit business, D.No.10/56A, Avvaru Street, Dommaranandyala village, Mylavaram mandal, Kadapa dist. ...Respondent/J.Dr.

రూల్ 22 నోటీసు

వాది, ప్రతివాదియైన నీపై పొందిన డిక్రీ అమలు కొరకు ఇపి ధాఖలు చేసినారు. ఆ పిటీషన్లో జారీ చేసిన రూల్ 22 నోటీసు నీ హాజరు కొరకై 18.8.2025 వతేదిన ఉన్నది. ఆరోజున నీవు ఉదయం 10.30గం॥లకు పైకోర్టులో హాజరై నీకేమైన అక్షేవనలు ఉన్నఎడల తెలుపుకోవలసినది. లేనంతట పరోక్షంలో తీర్మానించబడును.

వాయిదా తేది: 18.8.2025
//బై ది ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
J.L.MAHESWARI,
వాది తరపు అడ్వకేట్,
జమ్మలమడుగు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE: JAMMALAMADUGU

E.P.NO.36/2025
O.S.NO.72/2020

Yerramreddy Ramakrishna Reddy, S/O Lakshmi Narayana Reddy, Hindu, aged about 46 years, Mason, residing at D.No.1/96A, Karamalavari palli village, Mylavaram mandal, Kadapa dist. ...Petitioner/D.Hr.

Vs

Palla Bala Kondappa, S/O Narasimhulu, aged 60 years, Hindu, Chit business, D.No.10/56A, Avvaru Street, Dommaranandyala village, Mylavaram mandal, Kadapa dist. ...Respondent/J.Dr.

రూల్ 22 నోటీసు

వాది, ప్రతివాదియైన నీపై పొందిన డిక్రీ అమలు కొరకు ఇపి ధాఖలు చేసినారు. ఆ పిటీషన్లో జారీ చేసిన రూల్ 22 నోటీసు నీ హాజరు కొరకై 18.8.2025 వతేదిన ఉన్నది. ఆరోజున నీవు ఉదయం 10.30గం॥లకు పైకోర్టులో హాజరై నీకేమైన అక్షేవనలు ఉన్నఎడల తెలుపుకోవలసినది. లేనంతట పరోక్షంలో తీర్మానించబడును.

వాయిదా తేది: 18.8.2025
//బై ది ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//
J.L.MAHESWARI,
వాది తరపు అడ్వకేట్,
జమ్మలమడుగు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA.

E.P. No. 313/2023
D.R.K. No. 227/2021

Shriram Raghavendra Chits Pvt. Ltd., represented by its Branch Manager (Foreman), D.No. 19/92, 1st Floor, Near Gokhul Circle, Madras Road, Kadapa City & District. ...Petitioner/D.Hr.

Vs

Sri Nagam Narasa Reddy, S/o. Nagam Pedda Konda Reddy, Hindu, aged about 62 years, Finance Business, resident of D.No. 41/659, Sankarapuram, h/o. Chinnachowk, Kadapa City & District. ...Respondent No.1/J.Dr. No.1

మొదటి రెస్పాండెంట్ జె.డి.ఆర్.నెం. 1 కోర్టు నోటీసు

డిక్రీ హోల్డర్ దాఖలు చేసిన పై ఈ.పి.నెం. 313/2023 లో నీకు ఇంతవరకు మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి, కడప వారి కోర్టు నుండి నీ మీద ఈ.పి. దాఖలు చేసినట్లు నీకు కోర్టు నోటీసు ముట్టనందున రాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు నీవు కోర్టులో హాజరగుటకు పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలుపవలెనని ఉత్తర్వులు పాలించియున్నారు. కావున నీవు 21.08.2025వ తేదిన ఉదయం. 10.30 గంటలకు కుద్దున గాని, వకీలు ద్వారా గాని మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఎదుట హాజరై పై ఈ.పి. గురించి నీకు ఏవైనా అభ్యంతరములు వుంటే తెలుపుకొనవచ్చు. లేనంతట రాజశ్రీ కోర్టు వారు నీ పై పరోక్షంగా ఉత్తర్వులు పాలించెదురు.

//కోర్టు ఉత్తర్వు ప్రకారం ప్రచురించడమైనది//
T.S.RANGANAYAKULU B.A.,L.L.B.,
వాది పరం న్యాయవాది,
కడప. సెల్: 8179860120.